# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 29-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రజలు తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- ❖ సుస్థిర పాలతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- ❖ ప్రభుత్వ పాఠశాల్లో ప్రవేశాలు పెరగాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు.
- ❖ దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ గాలుల కారణంగా రాష్ట్రంలో రాగల మూడు రోజులు తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

===========================

ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగస్వాములయ్యారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ రోజు జరిగిన “మన్ కి బాత్ మనసులోని మాట” 123వ సంచికలో భాగంగా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... ఎక్కువ మంది ప్రజలు తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకున్నారని అన్నారు. విశాఖపట్నం సాగర తీరంలో 3 లక్షల పైగా ప్రజలు కలిసి యోగా చేశారని, 20 వేలకు పైగా గిరిజన విద్యార్థులు 108 నిమిషాల పాటు 108 సూర్య నమస్కారాలు చేశారని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 42 సెకన్లు)

బుద్ధ భగవానుని పవిత్ర అవశేషాల పరిశోధన ఆంధ్రప్రదేశ్ లోని పల్నాడు జిల్లాలోని నాగార్జున కొండలో జరిగిందని, ఈ ప్రాంతానికి బౌద్ధ మతానికీ గాఢమైన సంబంధం ఉందని ప్రధానమంత్రి అన్నారు. శ్రీలంక, చైనా దేశాలతో పాటూ దూరప్రాంతాల నుండీ ప్రజలు ఈ ప్రాంతానికి వచ్చేవారని చెప్పారు. అలాగే తీర్థయాత్రల గురించి మాట్లాడుతూ... కైలాష్ మానసరోవర్ యాత్ర, అమర్‌నాథ్ యాత్ర, జగన్నాథ్ రథయాత్రలను ప్రస్తావించారు. ఈ యాత్రలు ఏక భారత్-శ్రేష్ఠ భారత్

స్ఫూర్తిని ప్రతిబింబిస్తాయని అన్నారు. ఈ మతపరమైన యాత్రలు సేవా స్ఫూర్తికి ఒక గొప్ప అవకాశంగా నిలుస్తాయని చెప్పారు. మేఘాలయలోని ఎరి సిల్క్‌కు జిఐ ట్యాగింగ్ గురించి నరేంద్రమోదీ మాట్లాడుతూ... ఇది ఆ రాష్ట్రానికి వారసత్వ సంపద వంటిదని, దీనిని గిరిజనులు, ముఖ్యంగా ఖాసీ సమాజం ప్రజలు తరతరాలుగా సంరక్షిస్తున్నారని చెప్పారు. పట్టు పురుగులను చంపకుండా పట్టును సేకరిస్తాయని, అందుకే దీనిని అహింసా సిల్క్ అని కూడా పిలుస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు.

============================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పెంచుకునే మాన్ కీ బాత్ కార్యక్రమాన్ని పశ్చిమగోదావరి జిల్లా ప్రజలు ఈరోజు ఆసక్తిగా తిలకించారు. తాడేపల్లిగూడెంలోని భావన నిర్మాణ కార్మికులు సంఘం భవనంలో వివిధ వర్గాలకు చెందిన ప్రజలు తిలకించారు. ప్రధానమంత్రి ప్రసంగంపై ల్యాబ్ టెక్నీషియన్ తూమరాడ చిన్ని స్పందిస్తూ...

(వాయిస్ 17 సెకన్లు)

============================

ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి, ఆరు తరగతుల్లో ప్రవేశాలు పెరగాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ విద్యాశాఖాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ ఈరోజు శ్రవణమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ప్రవేశాలు తక్కువగా ఉన్నాయన్నారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

============================

భారత ప్రభుత్వ సంస్థ అలింకో సహకారంతో జిల్లా వ్యాప్తంగా జులై 3వ తేదీన విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని చిత్తూరు జిల్లా డిఆర్ఓ మోహన్ కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలో గల పివికేఎన్ కళాశాలలో కృత్రిమ అవయవాల పంపిణీ జరుగుతుందని, ఈ కార్యక్రమానికి కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రి రాందాస్ అథావలే హాజరుకానున్నారని మోహన్ కుమార్ తెలిపారు.

విరామం

============================

సుస్థిర పాలనతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ రోజు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా జులై 2వ తేదీ నుంచి నిర్వహించనున్న సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటి ప్రచారంపై పార్టీ నేతలకు చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేసారు. ప్రతీ ఇంటికి వెళ్లి సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలు సమన్వయంతో ముందుకెళ్తున్నాయన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పోలవరానికి నిధులు అందించిందని, ఈ ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని పేర్కొంటూ..

(వాయిస్ 35 సెకన్లు)

అలాగే వాట్సప్ గవర్నెన్స్‌తో సుమారు 500 సేవలు ఆన్‌లైన్‌లో అందిస్తున్నామని... ఆగస్టు 15 నాటికి మరిన్ని సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

============================

తూర్పు గోదావరి జిల్లా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూలై 1న కొవ్వూరు నియోజక వర్గం తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలియచేశారు. అనంతరం ముఖ్యమంత్రి పి-4 గ్రామ సభలో పాల్గొంటారు. ఈ రోజు కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి  పర్యటన నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్ల విషయంలో అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.

===========================

దేశంలో ప్రణాళిక రచన, ఫలితాల అంచనా, అభివృద్ధి సూచికలు తయారీలో గణాంకాలు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తాయని శ్రీకాకుళం జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి వి.యస్. యస్. లక్ష్మి ప్రసన్న పేర్కొన్నారు. శ్రీకాకుళం సిపిఓ కార్యాలయంలో జాతీయ గణాంకాల దనోత్సవం సందర్భంగా గణాంక శాస్త్ర నిపుణుడు ప్రశాంత చంద్ర మహల్నో బిస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దేశ వ్యాప్తంగా జాతీయ గణాంకాల దినోత్సవాన్ని  2007 సంవత్సరం నుండి నిర్వహిస్తున్నామన్నారు. గణాంక పితామహునిగా పేరుగాంచిన మహల్ నోబిస్ నమూనా సర్వేల రూపకల్పనను దేశములో ప్రవేశ పెట్టారని చెప్పారు.

===========================

ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు తేలికపాటి నుండి ఒక మోస్తరు  వర్షాలు  లేదా ఉరుములతో కూడిన జల్లులు  కొన్ని చోట్ల  కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములతో కూడిన మెరుపులు, ఈదురు గాలులు గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని తెలిపింది. వేడి, తేమతో కూడిన వాతావరణ పరిస్థితులు ఒకటి లేదా రెండు చోట్ల ఏర్పడే  అవకాశం ఉందని వెల్లడించింది.

===========================

===========================